క్లుప్తంగా

ఈనెల 21న స్పెషల్ లోక్ అదాలత్

అద్దంకి రూరల్: ఆంధ్రప్రదేశ్ న్యాయసేవాధికార సంస్థ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 21 శనివారం అద్దంకి కోర్టు భవనాల సముదాయంలో స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ టీ. బాబూనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ లోక్ అదాలత్‌లో రెవెన్యూ కేసులు, రోడ్డు ప్రమాద కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రేపు ఉచిత కంటి, గుండె వైద్య శిబిరం

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ చీరాల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు రోటరీ సామాజిక భవనంలో స్మార్ట్ విజన్ కంటి హాస్పిటల్, చైతన్య కార్డియాక్ సెంటర్ వారి సహకారంతో ఉచిత కంటి, గుండె వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో పరీక్షలు జరిపి ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు వెంట తీసుకుని రావాలన్నారు. అవకాశాన్ని చీరాల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధ్యక్షులు మామిడాల శ్రీనివాసరావు, ప్రతినిధులు పీవీ తులసీరామ్, పోలుదాసు రామకృష్ణ తదితరులు తెలిపారు.

ఫిజియోథెరపీతో ఆరోగ్యం



దివ్యాంగులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు

చీరాల టౌన్: మానసిక దివ్యాంగులకు ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ బాగా ఉపయోగపడుతాయని డాక్టర్ శ్రావణ్ కుమార్‌రెడ్డి సూచించారు. వరల్డ్ సెరిబ్రల్ పాల్సీ డేను పురస్కరించుకుని పేరాల విఠల్‌నగర్‌లోని చైతన్య మనోవికాస కేంద్రంలో ఉన్న మానసిక దివ్యాంగులకు కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజ్ సహకారంతో ఉచిత వైద్య శిబిరంతో పాటు అల్పాహారాన్ని అందించారు. మానసిక దివ్యాంగులకు వైద్యులు శ్రావణ్‌కుమార్‌రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఫిజియోథెరపీ చేశారు. కార్యక్రమంలో కేంద్రం డైరెక్టర్ వెంకన్నబాబు, ప్రిన్సిపాల్ మాధురి, హాస్పిటల్ సిబ్బంది ఉన్నారు.

మధుమేహంపై అప్రమత్తత అవసరం

వేటపాలెం: మధుమేహ (షుగర్) రోగులు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జీ సురేష్ సూచించారు. దేశాయిపేట పంచాయతీ నీల కంఠాపురంలోగల అనాథ వృద్ధ శరణాలయంలో సత్రం వెంకట రజనీకుమార్ స్మారక ఉచిత మధుమేహ వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్సై మాట్లాడుతూ షుగర్ రోగులు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల కొంత ఉపశమనం కనిపిస్తుందన్నారు. డాక్టర్ ఏ శంకర్‌రెడ్డి 130 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమం శాశ్వత కన్వీనర్ సత్రం మల్లేశ్వరరావు, డాక్టర్ బదరీనాథ్, విశ్వేశ్వరరావు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు పీఎం విశ్వకర్మపై అవగాహన

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కమతేశ్వరస్వామి దేవస్థానంలో ప్రధానమంత్రి విశ్వకర్మ కౌశల్ యోజనపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మానందం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు సంప్రదాయ కులవృత్తుల వారు పాల్గొనాలని ఆయన కోరారు.

సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- ఏపీ శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య
- నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్
- మందులు పంపిణీ చేసిన ఎమ్మెల్సీ సునీత



చల్లారెడ్డిపాలెంలో వైద్యులు, సిబ్బందితో నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్



సంతమాగులూరులో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య



మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ సునీత

అద్దంకి/మేదరమెట్ల/జే.పంగులూరు: ఆరోగ్యమే మహాభాగ్యమని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. ఆయన శుక్రవారం సంతమాగులూరు మండలంలోని తంగేడుమల్లి, అద్దంకి మండలంలోని శింగరకొండపాలెం గ్రామ సచివాలయాల పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా నిర్వహించే క్యాంపుల్లో నిష్ణాతులైన వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన మందుల పంపిణీతో పాటు, అవసరమైన వైద్యాన్ని సూచిస్తారని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఇష్టమైన వైద్యశాలల్లో ఉచితంగా చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమాల్లో పార్టీ మండల కన్వీనర్లు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

➤ జే.పంగులూరు మండలంలోని కొండమూరు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని కృష్ణచైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివచెన్నయ్య మాట్లాడుతూ 355 మంది రోగులను పరీక్షించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రాజశ్వేరి శ్రీలేఖ, వెంకటసత్య రామచంద్ర, తహసీల్దార్ ఐ పద్మావతి, ఎంపీడీఓ రామాంజినేయులు, మండల కన్వీనర్ యర్రం శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆర్ వెంకటసుబ్బారావు, సర్పంచ్ బండి శివకుమారి, ఎంపీటీసీ గుర్రం కళ్యాణి, పంగులూరు గ్రామ సర్పంచ్ జీ నాగేంద్రం రామారావు, నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, ఎస్ నందిరెడ్డి పాల్గొన్నారు.

➤ కొరిశపాడు మండలంలోని దైవాలరావూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని కృష్ణచైతన్య పేర్కొన్నారు. శిబిరంలో 392 రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, ఎంపీడీవో సురేష్‌బాబు, డాక్టర్లు టీ.నాగమణి, అనీష్, స్పెషలిస్ట్ డాక్టర్లు ఎస్ రాజేష్, పీ పృథ్వీ, నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యం..

వేటపాలెం/చీరాల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ మరింత మెరుగైన వైద్యం అందుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చల్లారెడ్డిపాలెం-2 సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేష్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. క్యాంపులో రోగులను అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు రకాల వైద్య పరీక్షలను ఇంటి వద్దనే నిర్వహించి, కేస్ షీట్లు రూపొందించి వైద్య శిబిరానికి పంపిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి లేళ్ల శ్రీధర్, గవిని వెంకట్రావు, పులి సోమయ్య, బొంతగర్ల కోటేశ్వరరావు, గవిని శ్రీనివాసరావు, గడ్డం వెంకటేశ్వర్లు, కోడూరి జయరావు, గొల్లప్రోలు శ్రీరామ్‌మూర్తి, సూపరింటెండెంట్ శాస్త్రి, ఏపీఎం శ్రీనివాస్, కార్యదర్శి శివలీల, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

➤ చీరాల రూరల్ మండలం తోటవారిపాలెం-1 సచివాలయం పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్సీ సునీత, కరణం వెంకటేష్ పాల్గొని మాట్లాడారు. రిజిస్ట్రేషన్ల విభాగం, రక్త నమూనాలు సేకరించే కౌంటర్, హెల్ప్ డెస్క్, ల్యాబ్ విభాగాలను ఆయన పరిశీలించారు. ఒక్కో కౌంటర్ వద్ద ప్రజలకు అందుతున్న సేవలను, వైద్య పరీక్షల వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, చీరాల మండల అధ్యక్షుడు ఆసాది అంకాలరెడ్డి, ఆర్బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బోయిన కేశవులు, తహసీల్దార్ జి.ప్రభాకరరావు, ఎంపీడీవో నేతాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు పార్వతి, ఏపీఎం సుబ్బారావు, మెడికల్ ఆఫీసర్ శ్రీదేవి, చీరాల మండల జేసీఎస్ ఇన్‌చార్జి బుర్ల సాంబశివరావు, నాదెండ్ల కోటేశ్వరరావు, గవిని సాంబయ్య, గవిని కోటేశ్వరరావు, గవిని ప్రసాద్, దబ్బుకూటి శ్రీను, పిట్టు నాగరాజు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల్లో పలు రకాల పరీక్షలు..

ఇంకొల్లు (చినగంజాం)/యద్దనపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మండలంలోని నాగండ్ల సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 336 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసినట్లు ఎంపీడీఓ రాజ్యలక్ష్మి తెలిపారు. గ్రామ సర్పంచ్ కంచుగంటి పద్మావతి క్యాంప్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మండల ప్రత్యేక అధికారి రమేష్‌బాబు క్యాంపును పర్యవేక్షించారు. డాక్టర్ సిద్ధార్థ, డాక్టర్ సజన్ విజయన్, డాక్టర్ ఎమీమా, డాక్టర్ శివశంకరయ్యలు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోమేపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకటేశ్వరరావు, సీహెచ్‌ఓ కోటేశ్వరరావు, పీహెచ్‌ఎన్ సహస్ర, సూపర్‌వైజర్లు మాళి, ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

➤ యద్దనపూడి మండలంలోని పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీడీఓ కృష్ణకుమారి పరిశీలించారు. శిబిరంలో 570 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యాధికారి సుభాషిణి తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మోహన్‌రావు, సర్పంచ్ మేకా సుధాకర్, వైద్యాధికారులు సుజిత్, నిహారిక, హరికృష్ణ, వీరబాబు, వంశీకృష్ణ, లక్ష్మిగౌరి, కార్యదర్శి భాగ్యరాజు, పీహెచ్‌సీ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

బల్లికురవ: జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో భాగంగా శుక్రవారం ఉప్పుమాగులూరు 2 సచివాలయ పరిధిలోని సోమవరప్పాడు గ్రామంలో 301 మందికి వివిధ రకాల పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వీరిలో 12 మందిని ఆరోగ్యశ్రీ వైద్యశాలలకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, తహశీల్దార్ కె. రవిబాబు, వైద్యాధికారులు రమీజ్ అహమ్మద్ శేషగిరి, భారతి, సౌజన్య పాల్గొన్నారు.



దైవాలరావూరులో కార్యక్రమానికి హాజరైన జనం



కొండమూరులో వైద్యశాలకు వచ్చిన గ్రామస్తులు



నాగండ్లలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ వైద్యాధికారి



పూనూరులో పాల్గొన్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

పూడికతీత పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం

చీరాల: అభివృద్ధి పనులలో భాగంగా చీరాల నుంచి వేటపాలెం మండల వరకు ఉన్న కుందేరు బ్రిడ్జిలను శుక్రవారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పరిశీలించారు. కుందేరులో ఉన్న గుర్రపు డెక్క, జమ్ము తొలగింపు, అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు తాగునీరు, విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే ఆయన అధికారులకు తెలియజేసి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, జెసిఎస్ మండల ఇన్‌చార్జి లేళ్ల శ్రీధర్, మాజీ సర్పంచ్‌లు చుండూరి వాసు, కట్టా గంగయ్య, దంతం మంతు, డ్రైనేజీ డీఈ దివి సుబ్బారావు, పంచాయితీరాజ్ డీఈ శేషయ్య, మున్సిపల్ డీఈ ఐసయ్య, ఏఈఈ జెవై కోటేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీలు, అధికారులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- గడప గడపలో శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య



వైదనలో సమస్యలు తెలుసుకుంటున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

బల్లికురవ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి ఎన్నో కొత్త పథకాలు ప్రవేశపెట్టి చేయూత నిస్తున్నారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. మండలంలోని వైదన సచివాలయం పరిధిలో శుక్రవారం రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారులకు వివరిస్తూ పథకాలకు సంబంధించిన బుక్‌లెట్ అందజేశారు. గ్రామాలోనే రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో నాణ్యమైన విత్తనాలు ఎరువులు, ఈ పంట నమోదు, ఈ-కేవైసీతో రైతులకు తోడ్పాటునిస్తున్నట్లు చెప్పారు. త్వరలో జరిగే ఎన్నికల్లో రెండోసారి జగనన్నను సీఎంగా ఆశీర్వదించాలన్నారు. వైదనలో గిరిపుత్రులు 5 దశాబ్దాలుగా పక్కా ఇళ్లకు దరఖాస్తు చేసిన గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. మాప్రభుత్వంలో జగనన్న కాలనీ లేఅవుట్‌లో 20 మందికి నివేశన స్థలాలు మంజూరు చేయగా 18 గృహాలు పూర్తిచేసుకుని ఉంటున్నారని ఇది చాలా శుభపరిణామమని చైతన్య అన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు అధ్యక్షుడు మండల పార్టీ అధ్యక్షుడు చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ మేడా జయలక్ష్మీ, ఎంపీటీసీ నక్కా పార్వతి, జేసీఎస్ అధ్యక్షుడు నరేష్, సొసైటీ అధ్యక్షుడు అంజయ్య, మేడా శివదుర్గా, బొమ్మిశెట్టి బ్రహయ్య, చింతల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

యద్దనపూడి: పింఛన్ కోసం గ్రామానికి వచ్చిన వృద్ధుడు అదృశ్యమైన విషయమై యద్దనపూడి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి కేసు నమోదైయింది. ఎస్సై నాగశ్రీను వివరాల మేరకు.. యద్దనపూడి ఎస్సీ కాలనీకి చెందిన కొమ్మాలపాటి ఏలేశమ్మ అమె భర్త ఆంజనేయులు గత పదేళ్లుగా జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌లో కూలీపనులు చేసుకుంటూ ఉంటున్నారు. ఈ క్రమంలో గతేడాది మే 3న పింఛన్ కోసం స్వగ్రామం బయలుదేరిన ఆంజనేయులు తిరిగి హైదరాబాద్ చేరుకోలేదు. భర్తకు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ వస్తుండటంతో దీంతో భార్య ఏలేశమ్మ గ్రామస్తులను ఆరా తీయగా ఆంజనేయులు స్వగ్రామం రాలేదని తెలుసుకుంది. అప్పటి నుంచి తెలిసిన చోట, బంధువుల వద్ద ఆరా తీసినా భర్త ఆచూకీ తెలియకపోవటంతో శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

అద్దంకి రూరల్: రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలైన ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని చినకొత్తపల్లి గ్రామం వద్ద చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు వెంపరాల గ్రామానికి చెందిన సాయిమణికంఠ చైతన్య కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. సాయంత్రం కాలేజి వదిలిన తరువాత ఆటోలో ఇంటికి వెళ్తుండగా చినకొత్తపల్లి గ్రామం వద్దకు రాగానే ఎదురుగా బైకు వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో విద్యార్థికి కాలికి తీవ్రగాయాలయ్యాయి. 108లో అద్దంకి వైద్యశాలకు తరలించి, అనంతరం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

బేల్దారీ కూలీకి గాయాలు..

బైకును లారీ ఢీకొన్న ఘటనలో కూలికి గాయాలైన ఘటన శుక్రవారం రాత్రి అద్దంకి సమీపంలో చోటుచేసుకుంది. మండలంలోని కలవకూరు గ్రామానికి చెందిన బేల్దారి కూలి బైకు మీద అద్దంకి నుంచి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో ఎదరుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో కూలికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

సంక్షేమ పథకాలతో లబ్ధిదారుల్లో సంతోషం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న వెంకటేష్

చీరాల: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, ఇంటింటా ఆరోగ్యపు వెలుగులు విరబూయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షిస్తున్నారని చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. శుక్రవారం రాత్రి చీరాల పట్టణంలోని 2వ వార్డులోని శృంగారపేట సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఇన్‌చార్జి కరణం వెంకటేష్ సమావేశం నిర్వహించారు. అనంతరం వార్డులోని ప్రతి గడపకు వెళ్లి కుటుంబ సభ్యులను పలకరించి ప్రభుత్వం అన్నివర్గాల వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయాని అని అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు పార్టీకి అండగా నిలిచి మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌ను చూసేందుకు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, ఆర్‌బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, 2వ వార్డు ఇన్‌చార్జి సూర్యవర్ధనరాజు, యాతం మేరిబాబు, సునీల్, బిళ్లా రవి, కొంద్రు ప్రతాప్, గృహ సారథులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ

వేటపాలెం: బైపాస్ రోడ్డు కూడలిలో ప్రయాణికుల సౌకర్యార్థం నూతనంగా నిర్మిస్తున్న బస్ షెల్టర్‌కి వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేటపాలెం నుంచి కఠారివారిపాలెం వెళ్లే రోడ్డులో బైపాస్ రోడ్డు కూడలిలో ప్రయాణీకుల బస్‌కోసం వేచి ఉండటానికి బస్‌షెల్టర్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, కఠారి సోమయ్య, కటారి తిరపతయ్య, గవిని వెంకట్రావు, శ్రీరామ్ మూర్తి, పులి సోమయ్య, ఆవుల అశోక్, కర్ణ ప్రసాద పాల్గొన్నారు.

బండారుకు మహిళలే తగిన బుద్ధి చెప్తారు



పర్చూరులో బండారు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న మహిళలు

పర్చూరు (కారంచేడు): మహిళా మంత్రి ఆర్‌కే రోజాపై టీడీపీ నాయకుడు బండారు సత్యన్నారాయణ చేసిన వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణలు చెప్పాలని పర్చూరుకు చెందిన మహిళలు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రమైన పర్చూరు బొమ్మలసెంటర్‌లో మహిళలు ర్యాలీ నిర్వహించారు. ముందుగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు బండారు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బండారు ఇలాంటి కారుకూతలు కూసేటప్పుడు మీ ఇంట్లో కూడా మహిళలన్నారనే విషయాన్ని గుర్తించుకోవాలని విమర్శించారు. మహిళలను అవమానపరచి బండారు చాలా తప్పు చేశారన్నారు. మరలా ఇలాంటి చౌకబారు వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమని వారు హెచ్చరించారు. తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందన్నారు. అనంతరం బొమ్మల సెంటర్‌లో బండారు దిష్టిబొమ్మను వారు దగ్ధం చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకులు తులసి నాగమణి, ఎమ్ సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకులు అడపా సుధాకర్‌రెడ్డి, మల్లా శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి ప్రసాద్, రామకృష్ణ, ఆకుల హేమంత్, జంగా అనీల్, మహిళలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల్లో పోషకాలు



కొర్రల సాగును పరిశీలిస్తున్న ఏడీఏ ఎఫ్రాయం, రమణారెడ్డి



పూనూరులో సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీఏ మోహన్‌రావు

చీరాల టౌన్:

క్రిమి సంహారక మందులు, పురుగు మందులు వాడకుండా పండించిన ఆహార ఉత్పత్తుల్లో పోషకాలు అధికంగా ఉంటాయని ఏడీఏ ఎఫ్రాయం అన్నారు. శుక్రవారం మండలంలోని కావూరివారిపాలెం గ్రామ పంచాయతీలోని రైతు భరోసా కేంద్రంలో గ్రామస్థాయి రైతు సమావేశం నిర్వహించారు. గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ అధికారి వెంకటరమణారావు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన కొర్ర పంటల సాగును ఏడీఏ, ఏవో సుమతి, ఆర్‌బీకే చైర్మన్ రమణారెడ్డి, సిబ్బంది పరిశీలించారు. అనంతరం రైతులతో ఏడీఏ మాట్లాడుతూ ఎలాంటి క్రిమిసంహారక మందులు, ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో కొర్రలు సాగు చేయడం అభినందనీయమన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన పంటల్లో పోషకాలు అధికంగా ఉండటంతో పాటుగా సాగు ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన పెంపొందించుకుని సాగు చేయాలన్నారు. రైతులు పండించే పంటలకు ఈ-క్రాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే అధికారి ఎమేలియా, రైతులు, ఆర్‌బీకే సిబ్బంది ఉన్నారు.

పురుగుమందుల వాడకంతో పంటలకు నష్టం

యద్దనపూడి (పూనూరు): చీడపీడల నివారణకు పంటలపై విచక్షణ రహితంగా రసాయనిక పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని పర్చూరు ఏడీఏ మోహన్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలోని పూనూరు రైతుభరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంటలపై వచ్చే తెగుళ్లు, చీడపీడల నివారణకు ఏఏ కషాయాలు వాడుతున్నారు తదితర విషయాలను ఐసీఆర్పీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక దిగుబడులే లక్ష్యంగా సాగుచేస్తున్న వాణిజ్య పంటల్లో రైతులు పరిమితికి మించి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడి నష్టాల పాలవుతున్నారన్నారు. దీని నివారణకు రైతులు ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే ఆకులు, వేర్లు, ఆవుమూత్రం, ఆవుపేడ తదితర వస్తువులతో తయారుచేసే దశపర్ణిక కషాయం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, వావిలాకు కషాయం, వేపగింజల కషాయం, ద్రవ జీవామృతం వంటి కషాయాలను పిచికారీ చేసుకోవాలన్నారు. తద్వారా పంటలను ఆశించే పురుగులను నివారించటమే కాక మిత్ర పురుగులను సంరక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎల్‌టూ వెంకటరత్నం, ఐసీఆర్పీలు శ్రీలక్ష్మి, అశ్విని, సంధ్యారాణి, మెరిసెమ్మ, కోటేశ్వరావు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే ప్రగతికి సోపానాలు



సన్మాన గ్రహీతలతో రోటరీ సభ్యులు

అద్దంకి: భావిభారత విద్యార్థులను తయారు చేసి ప్రగతికి అందించేవారే ఉపాధ్యాయులని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గీతామందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకుడు, భౌతిక శాస్త్ర రచయిత డాక్టర్ మొహమ్మద్ నయీమ్, కోట అంజమ్మ, కొణిదెన వీర విజయ్‌కుమార్, నిడమానూరి ఈశ్వరయ్య, తెలుకుట్ల ప్రసాద్, దేవరకొండ వెంకటేశ్వర్లు, ఏ శ్రీనివాసరావు, ఒరుగంటి శ్రీనివాసరావు, గానుగపాటి ఏలీషా, గోగుల కోటేశ్వరరావు, మావిళ్లపల్లి ఉమాజ్యోతి, పర్చూరు నాగలక్ష్మిని ఘనంగా సన్మానించి వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమానికి రోటరీ అధ్యక్షుడు చిన్ని మరళీ కృష్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సెక్రటరీ వీరయ్య, వీరవల్లి సుబ్బారావు, షేక్ మహ్మద్ రఫీ, పువ్వాడ రామకోటేశ్వరరావు, ఎస్ శ్రీనివాసరావు, బాచిన పూర్ణచంద్రరావు, తమ్మన శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి, అద్దంకి లెవీప్రసాద్, ఎన్ శంకరారెడ్డి, ఎన్ శ్రీలక్ష్మి, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.